సాక్షి
అనంతపురం
గురువారం । 2 ఫిబ్రవరి । 2023



'చాట్‌బాట్' దూకుడు

సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు 'చాట్‌బాట్' సేవలతో ఉపశమనం కలుగుతోంది. రూ.8.25 కోట్లు విలువ చేసే 5,077 ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. 18లో



టమాట కిలో రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ఠంగా రూ.20, కనిష్ఠం రూ.5, సరాసరి రూ.12 ప్రకారం ధర పలికాయి.

గరిష్ఠం/కనిష్ఠం
31.8°/13.3°

జిల్లా అంతటా బుధవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవగా, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్


4న వ్యవసాయ మంత్రి 'కాకాని' రాక

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ఈ నెల 4న అనంతపురం వస్తున్నట్లు ఉద్యానశాఖ జిల్లా అధికారి బి.రఘునాథరెడ్డి, మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి బుధవారం 'సాక్షి'కి తెలిపారు. నగర శివారులోని ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ హైస్కూల్‌లో ఆర్డీటీ, ఏపీ మాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయలసీమస్థాయి రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవో) కాన్ఫరెన్స్‌కు ముఖ్య అతిథిగా మంత్రి హాజరవుతారన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, రాయలసీమ జిల్లాల ఉద్యాన, మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులు, ఎఫ్‌పీవో ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల్లో ఎఫ్‌పీవోల భాగస్వామ్యం కీలకంగా మారినందున, రైతులకు మరింత మేలు జరిగేలా భవిష్యత్తులో అనుసరించాల్సిన అంశాలపై ఇందులో చర్చించనున్నట్లు వెల్లడించారు.

వెబ్‌సైట్‌లో 'నవోదయ' హాల్‌టికెట్లు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో (2023–2024 విద్యా సంవత్సరానికి) 9వ తరగతిలో ఖాళీ సీట్ల కోసం ఈనెల 11న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్ల (అడ్మిట్ కార్డులు) https://www.nvsadmissionclassnine.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులందరు హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకుని పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. లేపాక్షి కేంద్రంలో పరీక్షకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఏవైనా సందేహాలుంటే 9402052201, 7893030442, 9490766360 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

15 వరకు హెచ్చెల్సీకి నీరు



ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి ఈ నెల 15 వరకు నీరు రానున్నట్లు ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ తుంగభద్ర జలాశయానికి ఈసారి 188 టీఎంసీల నీరు వచ్చి చేరిందన్నారు. హెచ్చెల్సీకి వాటా మేరకు 28.821 టీఎంసీలు కేటాయించారన్నారు. కేసీ కెనాల్‌కు కేటాయించిన వాటా నీటిలో రివర్స్ డైవర్షన్ కింద మరో రెండు టీఎంసీలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. తుంగభద్ర నుంచి ఆంధ్రా వాటాలో హెచ్చెల్సీకి 29.140 టీఎంసీలు నీటిని విడుదల చేయగా.. బొమ్మనహాళ్ వద్ద జనవరి 31 వరకు 26.980 టీఎంసీలు చేరినట్లు వెల్లడించారు. హెచ్చెల్సీ పరిధిలోని పీఏబీఆర్‌లో 5.043 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 3.580, సీబీఆర్‌లో 9.444, మైలవరం జలాశయంలో 5.120, చాగల్లు రిజర్వాయర్‌లో 1.020, పెండేకల్లు రిజర్వాయర్‌లో 0.195, ఎస్ఎస్‌బీఆర్ జలాశయంలో 0.015 టీఎంసీల నీరు నిల్వ ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 51.220 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. జలాశయం నుంచి హెచ్చెల్సీకి ఆంధ్రా, కర్ణాటకకు కలిపి 2,252 క్యూసెక్కులు విడుదల చేయగా.. ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద 1,314 క్యూసెక్కులు ఏపీకి విడుదలవుతున్నట్లు పేర్కొన్నారు. తుంగభద్ర నుంచి విడుదలవుతున్న నీటిని ఎంపీఆర్, పీఏబీఆర్ జలాశయాలకు మళ్లిస్తున్నట్లు తెలిపారు.

నిర్మలమ్మ పద్దు.. నిరాశాజనకం



- కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి
- వెనుకబడిన జిల్లాకు దక్కని ఆర్థిక దన్ను
- సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీకి గతేడాది కంటే తగ్గిన నిధులు
- వేతన జీవులకు మాత్రమే ఊరట

అనంతపురం: కేంద్ర బడ్జెట్ జిల్లావాసులను నిరాశ పరిచింది. కేటాయింపులపై వివిధ పార్టీల ప్రతినిధులతో పాటు మేధావులు పెదవివిరిచారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధుల ఊసేలేదు. కేవలం పన్ను పరిమితి విషయంలో మాత్రమే వేతనజీవులకు ఊరట కనిపిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వెనుకబడిన జిల్లాలకు ఏటా అందజేయాల్సిన రూ.50 కోట్లు బడ్జెట్‌లో చూపలేదు. దీనివల్ల రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు నష్టపోవాల్సి వస్తోంది. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న మేరకు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీని అనంతపురంలో ఏర్పాటు చేశారు. దీనికి తాజా బడ్జెట్‌లో రూ.47 కోట్లు మాత్రమే కేటాయించారు. గత బడ్జెట్ (2021–22)లో రూ.60.35 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.13.35 కోట్లు తక్కువ ఇవ్వడం గమనార్హం. అనంతపురం జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఒకే ఒక్క ఉన్నత విద్యా సంస్థకూ తక్కువ నిధులు కేటాయించడంపై విద్యావేత్తలు మండిపడుతున్నారు. యూనివర్సిటీ భవనాలు, పూర్తి స్థాయి క్యాంపస్ 2024 సంవత్సరంలోపు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కానీ ఆ స్థాయిలో కేటాయింపులు ఉండడం లేదు. 2019–20లో రూ.60.35 కోట్లు కేటాయించగా.. ఆ మొత్తాన్ని ఖర్చు పెట్టలేదు. 2020–21లో కేవలం రూ.4.80 కోట్లు కేటాయించారు. ప్రస్తుత కేటాయింపులు వర్సిటీ నిర్వహణ, వేతనాలకు కూడా చాలవని అంటున్నారు. ఇక శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం వద్దనున్న నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్)కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.

యువతకు డిజిటల్ లైబ్రరీలు..

వర్సిటీల్లో స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు జరిగాయి. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన వర్సిటీల్లో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పరిశ్రమల అభివృద్ధి, ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ ఏర్పాటుతో పాటు యువత, పాఠశాల విద్యార్థులకు నేషనల్ డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తేనున్నారు. దీనివల్ల జిల్లా విద్యార్థులకు కూడా లబ్ధి కలిగే అవకాశముంది.

అన్నదాతలకు నిరాశ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాదిమంది రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వారికి పెద్దగా ఊరట కల్గించే అంశాలేవీ కేంద్ర బడ్జెట్‌లో లేవు. పంటలకు మద్దతు ధరలు, రుణమాఫీ, పంటల బీమా, హార్టికల్చర్ హబ్‌కు నిధుల కేటాయింపు లేకపోవడంతో రైతులు, రైతుసంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రుణ వితరణ లక్ష్యం పెంపు, చిరుధాన్యాల సాగు, వ్యవసాయ అంకుర సంస్థలకు ప్రోత్సాహం వంటి చర్యలు జిల్లా రైతులకు కాస్త ఊరటనిచ్చేవే అయినా గరిష్ట లబ్ధి మాత్రం కలగదని అంటున్నారు.

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. కేటాయింపుల్లో మొండిచేయి చూపారు. విభజన హామీలను పూర్తిగా విస్మరించారు. రైల్వే జోన్ ప్రస్తావనే లేదు. పోలవరానికి నిధుల కేటాయింపు లేదు. కడప స్టీల్ ప్లాంట్‌కు కూడా నిధులు అందించలేదు. ప్రత్యేక హోదాను నీరుగార్చారు.

–పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

చిరుద్యోగులకు ఊరట



ఆదాయపు పన్ను శ్లాబులు మార్చడం చిరు,మధ్యతరగతి ఉద్యోగులకు ఊరట కల్గించే అంశం. యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ , మైనార్టీల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు కేటాయించారు. సమ్మిళిత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వీరందరికీ నిధులు ఎక్కువగా కేటాయిస్తున్నట్లు ప్రకటించడం సంతోషదాయకం. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీకి మాత్రం ఆశించినంత మేర నిధులు కేటాయించలేదు.

– ప్రొఫెసర్ ఎండీ బావయ్య, ఎకనామిక్స్ ప్రొఫెసర్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

దేశాన్ని అప్పుల్లోకి నెట్టేసింది



కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల్లో నెట్టేసింది. వేతన జీవులకు మినహా మిగతా వారికి ఉపయోగం లేదు. బ్రాండెడ్ దుస్తుల ధరలు భారీగా పెంచేశారు. బంగారు, వెండి, వజ్రాల ధరలను విపరీతంగా పెంచేశారు. దీనివల్ల ఆడపిల్లలకు పెళ్లికి అవసరమైన బంగారు, వెండిని తల్లిదండ్రులు కొనలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఏపీ విభజన హామీల్లో ఏ ఒక్క రాయితీ ప్రకటించలేదు. ఎరువులు, పెట్రోలు, డీజిల్ గురించి ఊసే ఎత్తలేదు.

– వెన్నపూస గోపాల్‌రెడ్డి, శాసనమండలి విప్

రైతును నిరాశపరిచింది



కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు వ్యతిరేక బడ్జెట్. మద్దతు ధరలు, రుణమాఫీ ప్రస్తావన, పంటల బీమాకు నిధుల కేటాయింపు లేకపోవడం రైతులను నిరాశపర్చింది. అన్ని రంగాలకూ కేటాయిస్తున్నట్లు ప్రకటించిన రూ.1.20 లక్షల కోట్లలో ఎరువుల సబ్సిడీకి నిధుల కేటాయింపు లేదు. ప్రధానంగా జిల్లాలో హార్టికల్చర్ హబ్‌కు నిధుల కేటాయింపులు లేవు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి కోతపెట్టడమంటే రైతులను ఏ మాత్రమూ ఆదుకునే పరిస్థితిలో బడ్జెట్ లేదనే విషయం స్పష్టమవుతోంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

సమ్మిళిత వృద్ధిని సూచిస్తున్న బడ్జెట్



గరీబ్ కళ్యాణ్‌యోజన, ఉపాధి కల్పన అంత్యోదయ స్ఫూర్తి ఈ బడ్జెట్‌లో కనిపిస్తోంది. రూ.10 లక్షల కోట్ల మూలధన వ్యయం ఉత్పాదక ఆస్తుల కల్పనకు ఊతమిస్తుంది. రైల్వే బడ్జెట్ రూ.2.40 లక్షల కోట్లకు పెంచడం వల్ల రైల్వే మౌలిక సదుపాయాల పెంపునకు దోహద పడుతుంది. రాష్ట్రాలకు రూ.1.30 లక్షల కోట్ల వడ్డీలేని మూలధన వ్యయం మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగపడుతుంది.

– సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ప్రజా వ్యతిరేక బడ్జెట్



50 కోట్ల మంది పేదలకు సంబంధించిన ఉపాధి హామీ పథకానికి నిధులు సగానికి తగ్గించడం దారుణమైన విషయం. దేశ సంపదను, సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు మోదీ ప్రభుత్వం నిస్సిగ్గుగా వ్యవహరిస్తోంది. ఈ విషయాన్నే బడ్జెట్ ప్రతిపాదనలు తేటతెల్లం చేస్తున్నాయి. ఎరువుల సబ్సిడీపై 25 శాతం కోత విధించారు. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ఎలాంటి చర్యలూ ప్రకటించలేదు. అనంతపురంలో ఎనిమిదేళ్ల క్రితం ప్రకటించిన సెంట్రల్ యూనివర్సిటీ ఇప్పటికీ ప్రహరీ దాటలేదు.

– వి.రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి

మొండిచేయి చూపారు



నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏపీ ప్రజలకు నిరాశ కలిగించింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ప్రస్తావన లేదు. 11 రకాల విద్యా సంస్థలకు నిధులు లేవు. రైల్వే బడ్జెట్‌లో పేదలకు, సీనియర్ సిటిజన్స్‌కు ఇచ్చే రాయితీలను తొలగించారు. టిక్కెట్ల ధరలు అత్యధికంగా పెంచడమనేది సరైంది కాదు. రైతులకు సంబంధించి పంటల బీమా, ఇరిగేషన్ వ్యవస్థ, గిట్టుబాటు ధరల ప్రస్తావనే లేదు. ఉపాధి హామీ పథకం నిధులు బాగా తగ్గించారు.

– జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

నిరాశాజనకం



కేంద్ర బడ్జెట్ పూర్తి నిరాశాజనకంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల శ్రేయస్సుకు విఘాతం కలిగించే రీతిలో బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయి. వెనుకబడిన ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేక నిధి అంశం ప్రస్తావించలేదు. ఈ బడ్జెట్ ప్రజలకు ఆమోదయోగ్యంగా ఎంతమాత్రమూ లేదు.

– బీకే పార్థసారథి, టీడీపీ నేత

బాల్య వివాహాలను అరికట్టాలి

- కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

నార్పల: బాల్య వివాహాలను అరికట్టాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం నార్పల సచివాలయం–1ను కలెక్టర్ తనిఖీ చేశారు. బాల్య వివాహాల నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. బాల్య వివాహాల నివారణకు మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ ,మహిళా పోలీసు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. బాల్య వివాహాల ఏర్పాట్లపై కనీసం 24 గంటలు ముందుగా సీడీపీఓలకు, చైల్డ్‌లైన్ విభాగానికి సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే వాటిపై సమగ్ర విచారణ జరిపి అందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారలోపంపై అవగాహన కల్పించి మంచి ఆహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల్లో పిల్లల ఎదుగుదలను గమనిస్తూ బలహీనంగా ఉండే వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఏ ఒక్కరు అలసత్వం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమె స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ మధుసూదన్, డీఎంహెచ్ఓ వీరబ్బాయి, డీఈఓ కృష్ణయ్య, ఏపీసీ తిలక్ విద్యాసాగర్, డీఐఓ యుగంధర్, ప్రోగ్రాం అధికారి నారాయణస్వామి, సీడీపీఓ ఉమాశంకరమ్మ, తహసీల్దార్ నారాయణస్వామి, ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శి అశ్వత్థనాయుడు పాల్గొన్నారు.



నార్పల సచివాలయ -1 సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మాతాశిశు మరణాలు తగ్గించాలి

బుక్కరాయసముద్రం: మాతా శిశు మరణాల రేటు తగ్గించేవిధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం బుక్కరాయసముద్రం సచివాలయం–1లో మండల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్ ఉండకూడదన్నారు. అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న, సర్పంచ్ పార్వతి, డీఎంహెచ్ఓ వీరబ్బాయి, ఎస్ఎస్ఏ ఏపీసీ తిలక్ విద్యా సాగర్, ఎంఈఓ గురుప్రసాద్, సీడీపీఓ ఉమా శంకరమ్మ, డాక్టర్ స్వాతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్‌కు చెక్!

ప్రజల ఆరోగ్యంపై జగన్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటోంది. పేదలకు ప్రభుత్వాస్పత్రుల్లోనే ఉచితంగా ఖరీదైన వైద్యం అందించేందుకు కృషి చేస్తోంది. తాజాగా నోటి క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి.. వ్యాధికి చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టింది. వైద్యులకు శిక్షణ ఇచ్చిన అనంతరం వెల్‌స్కోప్ మెషీన్లు ఏర్పాటు చేసి క్యాన్సర్ పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

- వెల్‌స్కోప్ మెషీన్లు అందుబాటులోకి..
- లక్షణాలను ముందస్తుగా గుర్తించే అవకాశం
- అనంత, సత్యసాయి జిల్లాల వైద్యులకు కడపలో శిక్షణ
- శిక్షణానంతరం జిల్లాల్లో వెల్‌స్కోప్ మెషీన్ల ఏర్పాటు



వెల్‌స్కోప్ మిషన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పొగాకు, పొగాకు మసాలాలతో పాటు బీడీలు, సిగరెట్ తాగుతున్న వారిలో నోటి క్యాన్సర్ తీవ్రమవుతోంది. ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకుంటున్న క్యాన్సర్ బాధితుల్లో ఆరు శాతం మంది నోటి క్యాన్సర్ (ఓరల్ క్యాన్సర్) వారే ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజురోజుకూ దీని తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ముందే ఓరల్ క్యాన్సర్‌ను పసిగట్టే చర్యల్లో భాగంగా ప్రభుత్వం సరికొత్త టెక్నాలజీతో నిర్ధారణ పరీక్షలు చేస్తోంది. ప్రాథమిక క్యాన్సర్ దశకు రాకముందే.. లేదంటే అలాంటి లక్షణాలు కనిపించకముందే క్యాన్సర్ స్థితిని ఓ పరికరం ద్వారా అంచనా వేస్తారు. ఇలాంటి పరికరాలను ఏపీ సర్కారు అందుబాటులోకి తెచ్చింది.



వెల్‌స్కోప్ మెషీన్ ద్వారా పరీక్షలు..

వెల్‌స్కోప్ మెషీన్ అంటేనే ఇదొక అత్యాధునిక వైద్యపరికరం. తరంగ దైర్ఘ్యాల నీలి కాంతిని ప్రేరేపణ చేసి నోటిలో ఉన్న పరిస్థితులను అంచనా వేస్తుంది. క్యాన్సర్ వచ్చే లక్షణాలను ముందే పసిగట్టగలిగే సామర్థ్యం ఉంటుంది. ప్రీ క్యాన్సర్ లక్షణాలే క్యాన్సర్‌కు దారి తీస్తాయి. వాటిని ముందే గ్రహించి చెప్పగలదు. ఇలాంటి వెల్‌స్కోప్ మెషీన్లను వైజాగ్, విజయవాడ, కడపలో ఏర్పాటు చేశారు. కడపలో ఏర్పాటు చేసిన ఈ మెషీన్ పరిధిలో 9 జిల్లాల వైద్యులకు శిక్షణ ఇస్తారు. ఇందులో శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలు ఉన్నాయి.

అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో...

పీహెచ్‌సీ వైద్యులకు, దంతవైద్యులకు వెల్‌స్కోప్ మెషీన్ ద్వారా శిక్షణ నిచ్చిన అనంతరం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోనూ వెల్‌స్కోప్ మెషీన్లు ఏర్పాటు చేస్తారు. మెషీన్ల ఏర్పాటు అనంతరం భారీ స్థాయిలో నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ఇలా ముందే లక్షణాలను గుర్తించి చికిత్స చేస్తే వేలాదిమంది ప్రాణాలను కాపాడవచ్చనేది వైద్యుల అభిప్రాయం. ఓ వైపు నిర్ధారణ పరీక్షలు చేస్తూనే అదే ప్రాంతంలో మరోవైపు పొగాకు ఉత్పత్తుల వాడకం నియంత్రణపై కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రస్తుతం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వైద్యులకు ఈ మెషీన్ ద్వారా నిర్ధారణ పరీక్షలు ఎలా చేయాలో శిక్షణ ఇస్తున్నారు.

క్యాన్సర్ బారినుంచి కాపాడవచ్చు



నోటి క్యాన్సర్ తీవ్రత ఎక్కువగా ఉంది. ముందస్తు లక్షణాలు గుర్తించి చికిత్స అందిస్తే వ్యయభారం తగ్గుతుంది. భవిష్యత్‌లో ఇది అన్ని చోట్లా విస్తరిస్తే మరింతగా లబ్ధి కలుగుతుంది. ముఖ్యంగా పొగాకు వాడకంతో క్యాన్సర్‌కు గురయ్యేవారిని క్యాన్సర్ బారినుంచి కాపాడచ్చు.

– డాక్టర్ శ్రీనివాసన్, క్యాన్సర్‌కేర్ నోడల్ ఆఫీసర్

ఠంచన్‌గా పింఛన్

- తొలిరోజే 90 శాతం పంపిణీ



అనంతపురంలోని 35వ డివిజన్‌లో పెరాలసిస్ బాధితుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉష

అనంతపురం సెంట్రల్: వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా జిల్లాలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత, డప్పు కళాకారులు, చర్మకారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్ అందింది. ఉదయాన్నే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ బట్వాడా చేశారు. ఈ నెలకు సంబంధించి మొత్తం 2,77,367 మందికి పింఛన్లు మంజూరు కాగా.. తొలిరోజు 2,48,507 మందికి నగదు అందజేశారు. మొత్తం మీద 90 శాతం నమోదైంది. పంపిణీలో మున్సిపాలిటీలు ముందంజలో ఉన్నాయి. తాడిపత్రి 92.08 శాతం, బుక్కరాయసముద్రం 89.79 శాతం, అనంతపురం అర్బన్ 89.60, పామిడి అర్బన్ 87.56, రాయదుర్గం 86.86, శింగనమల 86.09, గుత్తి అర్బన్ 85.73, గార్లదిన్నె 85.73, ఉరవకొండ అర్బన్ 85.22శాతం చొప్పున అందజేసి ముందు వరుసలో నిలిచాయి. రాప్తాడు, బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్, నార్పల, గుమ్మఘట్ట, బెలుగుప్ప, శెట్టూరు, బ్రహ్మసముద్రం కుందుర్పి, విడపనకల్లు మండలాలు వెనుకబడ్డాయి. మరో రెండు మూడు రోజుల్లో పింఛన్ పంపిణీ వంద శాతం పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి తెలిపారు.

సైబర్ కేసుల దర్యాప్తులో వేగం

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి సైబర్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశించారు. జిల్లాలోని ఎస్‌ఐ, ఆపై స్థాయి పోలీసు అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లతో బుధవారం ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళా సంబంధిత నేరాలు, సైబర్ నేరాలను అరికట్టే విషయాలపై సమగ్ర దర్యాప్తు కోసం నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. సైబర్ నేరాల గురించి ఫిర్యాదు వచ్చినప్పుడు ఏ విధంగా దర్యాప్తు చేయా లో సూచనలు చేశారు.

అక్రమ కట్టడాన్ని తొలగించాలి

- ఇన్‌చార్జ్ తహసీల్దార్, ఎస్‌ఐకు వైఎస్సార్‌సీపీ వినతి
- రెండురోజుల్లో చర్యలు తీసుకోవాలని డిమాండ్
- లేని పక్షంలో దీక్షలు చేపడతామని హెచ్చరిక

రాప్తాడు: రాప్తాడు పొలం కొత్త సర్వేనంబర్ 554–2 (పాత సర్వే నంబర్ 474)లో లక్ష్మీపండమేటి వేంకటరమణస్వామి ఆలయ మాన్యానికి చెందిన 1.02 ఎకరాల్లో అక్రమంగా నిర్మించిన టీడీపీ కార్యాలయాన్ని తొలగించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీఐఐసీ అనుమతి లేకుండానే భూమిని స్వాధీనం చేసుకోవడం.. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణం చేపట్టడంపై 'మాన్యం.. పరిటాల పరం' శీర్షికన సాక్షి మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో టీడీపీ కార్యాలయం (పరిటాల భవన్)ను తొలగించాలని డిమాండ్ చేస్తూ వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లికార్జున, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గోవింద్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఐఐసీ ఆటోనగర్‌కు ఇచ్చిన లీజులో లొసుగులను ఆధారం చేసుకుని పరిటాల కుటుంబం 2016లోనే కుట్రకు తెరలేపిందన్నారు. ప్రజాప్రయోజనార్థం అతిథిగృహం చేపడతామని చెప్పి.. టీడీపీ అనుకూల సర్పంచ్‌తో తీర్మానం చేయించి.. దాని ఆధారంగా తహసీల్దార్ ద్వారా ఏపీఐఐసీకి లేఖ రాయించిందని.. అనుమతులు రాకనే మాన్యంలోకి ప్రవేశించి.. అతిథిగృహం స్థానంలో ఏకంగా టీడీపీ కార్యాలయం నిర్మించి, పరిటాల భవన్ అని నామకరణం చేశారన్నారు. ఏపీఐఐసీ ఇచ్చిన లీజు షరతుల్లో స్లాబ్ వేయకూడదని.. రేకుల షెడ్లు మాత్రమే నిర్మించుకోవాలని ఉన్నా.. దానిని ఉల్లంఘించారన్నారు. ఈ కార్యాలయాన్ని మాజీ మంత్రి తమ్ముళ్లు, తనయుడు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే అక్రమ కట్టడాన్ని తొలగించాలని లేదా ఆ భవనాన్ని ప్రజాప్రయోజనాల కోసమైనా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లోపు చర్యలు తీసుకోకపోతే అక్రమ కట్టడం ముందే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే చంద్ర, చిరుతల నాగేంద్ర, కేశవయ్య, ముత్యాలన్న, మన్నల రవి, డొక్కా శంకరయ్య, రామలింగమయ్య, ఆనంద్ రెడ్డి, రమణారెడ్డి, చిన్న కృష్ణారెడ్డి, మారక సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లికార్జునకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

అర్హులందరికీ ఇంటి స్థలం ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అనంతపురం అర్బన్: ప్రభుత్వాలు పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు పక్కా గృహం నిర్మించి ఇవ్వాలన్నారు. ఇళ్లు, ఇళ్ళ స్థలం సాధనకు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 30 గంటల సత్యాగ్రహం కార్యక్రమానికి శ్రీనివాసరావు అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం బడాబాబులకు లబ్ధి చేకూర్చేందుకు పనిచేస్తోందన్నారు. కార్పొరేట్ సంస్థలకు వేల ఎకరాలు కట్టబెడుతున్న ప్రభుత్వాలు పేదలకు ఇంటి స్థలం ఇచ్చేందుకు సవాలక్ష ఆంక్షలు విధిస్తున్నాయన్నారు. జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో కాలనీలు ఏర్పాటు చేసుకుని నివాసముంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలన్నారు.

బధిర పాఠశాలను తనిఖీ చేసిన జేసీ



సౌకర్యాలపై ఆరా తీస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భంభంస్వామి లేఅవుట్‌లోని హోలిక్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగులు, బధిర ప్రత్యేక పాఠశాలను బుధవారం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకులు బధిర విద్యార్థులకు అందజేస్తున్న సౌకర్యాలు, ఇతరాత్ర విషయాలపై ఆరా తీశారు. మూగ, చెవిటి, వికలత్వ చిన్నారుల్లో నైపుణ్యతను వెలికి తీసేందుకు కృషి చేయాలని సూచించారు. సెంటర్ నిర్వహణకు సంబంధిత వార్షిక రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు తహసీల్దార్ మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

చాట్‌బాట్ దూకుడు

- సెల్‌ఫోన్ల రికవరీలో 'అనంత' పోలీసుల సత్తా
- ఇప్పటికే 5,077 ఫోన్లు బాధితులకు అందజేత
- ఏపీతో పాటు 15 రాష్ట్రాల బాధితులకు సేవలు
- ఇతర ప్రాంతవాసులకు 'ఉచిత డోర్ డెలివరీ'



రికవరీ చేసిన సెల్‌ఫోన్లు చూపుతున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: ఫోన్ పోయిందా.. గోవిందా అనుకునే రోజులు పోయాయి. పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు వెతికి మరీ ఉచితంగా ఇంటికి చేరుస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప ఆధ్వర్యంలో ప్రారంభించిన 'చాట్‌బాట్' సేవలకు అనూహ్య స్పందన లభిస్తోంది. పోయిందనుకున్న సెల్‌ఫోన్ తిరిగి చేతికి అందడంతో బాధితులు 'అనంత' పోలీసులను అభినందిస్తున్నారు.

5,077 ఫోన్ల రికవరీ..

చాట్‌బాట్ సేవలు ప్రారంభించిన అనతి కాలంలోనే రూ.8.25 కోట్లు విలువ చేసే 5,077 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. మంగళవారం ఒక్క రోజే 700 మొబైల్ ఫోన్లను బాధితులకు ఎస్పీ ఫక్కీరప్ప అందజేశారు. మొబైల్ ఫోన్ల రికవరీలో అనంత పోలీసులు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారు. భారీ స్థాయిలో ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ముట్టజెప్పడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా పోలీస్ టెక్నికల్ విభాగాన్ని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి సైతం అభినందించారు.

ఎఫ్ఐఆర్ లేకుండానే...

సెల్‌ఫోన్ పోతే బాధితులు పోలీసు స్టేషన్లకు వెళ్లకుండానే, ఎఫ్ఐఆర్‌తో కూడా సంబంధం లేకుండానే రికవరీ చేసి వారికి అందజేయాలనే సంకల్పంతో చాట్‌బాట్ సేవలను 2022 మార్చి 17న ఎస్పీ ప్రారంభించారు. వాట్సాప్ నంబర్ 9440796812 ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఫోన్లు పోగొట్టుకున్న జిల్లా వాసులతో పాటు వివిధ ప్రాంతాల వారు ఈ నంబరుకు ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు కూడా వేగంగా స్పందించి ఫోన్లు రికవరీ చేసి వారికి అందజేస్తున్నారు. సుదూర ప్రాంతాల వారు అనంతకు రాకుండానే ఫోన్లు పొందేలా ఉచిత డోర్ డెలివరీ సేవలను తాజాగా ప్రారంభించారు. ప్రొఫెషనల్ కొరియర్ సంస్థ సహకారంతో ఈ సేవలు అందిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఇప్పటి దాకా 15 రాష్ట్రాల బాధితులకు సుమారు 400 సెల్ ఫోన్లు రికవరీ చేసి అందించామని వెల్లడించారు. అలాగే రాష్ట్రంలోని 18 జిల్లాల బాధితులు ఈ సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు.

బొలెరోను ఢీకొన్న కారు

- పలువురికి గాయాలు



క్షతగాత్రులకు ధైర్యం చెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సీతారాంపల్లి వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ముందు వెళ్తున్న బొలెరో వాహనాన్ని వెనుక వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అందులో ఉన్న మామిళ్లపల్లిలోని పూసల కాలనీకి చెందిన శ్రీదేవి, కుళ్లాయప్ప, వన్నూరమ్మ, కదిరమ్మ గాయపడ్డారు. అదే రహదారిలో వెళ్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తన వాహనాన్ని క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు. వెంటనే స్థానికుల సహాయంతో వారిని చికిత్స నిమిత్తం 108లో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ మెకానిక్ కోర్సులో శిక్షణ

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్లో నిరుద్యోగ యువతకు టూ వీలర్ బైక్ మెకానిక్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 5వ తరగతి నుంచి పది/ఇంటర్/ ఐటీఐ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు 18–35 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులన్నారు. ఫీజు రూ.1500 ఉంటుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత మధ్యాహ్న భోజనం అందిస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం టూల్ కిట్ ఉచితంగా అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 6303580397, 9390505952 లను సంప్రదించాలన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశుసంక్షేమశాఖ పరిధిలోని బాలల పరిరక్షణ సమితి (ఐసీపీఎస్)లో సోషల్‌వర్కర్ (పురుషులు), శిశుగృహలో రెండు ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉద్యోగాల అర్హత వివరాలను అనంతపురం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 2 నుంచి 10 లోగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని వివరించారు.

వైభవంగా రంగనాథుడి బ్రహ్మోత్సవాలు



అలంకరణలో రంగనాథుడి ఉత్సవ విగ్రహాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజు బుధవారం రంగనాథస్వామి శేషవాహనంపై కొలువు దీరగా గ్రామ పుర వీధుల మీదుగా ఊరేగించారు. తిరునాల సందర్భంగా ఆలయ పరిసరాలు సందడి నెలకొంది.

శేష వాహనంపై కొండమీద రాయుడు



బుక్కరాయసముద్రం: కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల మధ్య పుర వీధులలో ఊరేగించారు. గురువారం రాత్రి శ్రీవారు హనుమద్వాహనంపై దర్శనమివ్వనున్నారు.

ప్రారంభమైన క్రికెట్ మ్యాచులు



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి హాజరైన క్రీడాకారులతో ముఖ్య అతిథులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాయలసీమ స్థాయి క్రిస్టియన్ యూత్ క్రికెట్ పోటీలు బుధవారం స్థానిక నీలం సంజీవరెడ్డి క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. రాయలసీమ బిషప్ ఐజాక్ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సాహించే ఉద్దేశంతో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు క్రిస్టియన్ యూత్ క్రికెట్ టోర్నీని నిర్వహించడం గర్వకారణమన్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన మొత్తం 12 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. తొలి రోజు నిర్వహించిన మ్యాచుల్లో గుత్తి జట్టు పై ఆళ్లగడ్డ , ప్రొద్దుటూరుపై జమ్మలమడుగు జట్టు, పులివెందులపై కడప జట్టు విజయం సాధించాయి. ఈ నెల 6న అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన క్రీడా మైదానంలో ఫైనల్ పోటీలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పాస్టర్ ప్రేమ్‌బాబు, యూత్ డైరెక్టర్ న్యాషి, పాస్టరేట్ కమిటీ సభ్యులు, యూత్ లీడర్లు ప్రశాంత్, సుశాంత్, స్టీవ్, ప్రమోద్, డ్యానీ తదతరులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన ఆంధ్ర, బిహార్ మ్యాచ్



తలపడుతున్న ఆంధ్ర, బిహార్ జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ ఆధ్వర్యంలో జిల్లా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ల సంయుక్త నేతృత్వంలో అనంత క్రీడా మైదానం వేదికగా నిర్వహించిన కల్నల్ సీకే నాయుడు క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాల్గవ రోజు ఆటను బుధవారం ఆంధ్ర, బిహార్ జట్లు కొనసాగించాయి. ఆంధ్ర జట్టు 9 పరుగులతో లీడ్ సాధించగా, నాల్గవ రోజు ఆటను బిహార్ జట్టు 70 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో ప్రారంభించింది. ఆట ముగిసే సమయానికి 88.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. బిహార్ జట్టు బ్యాట్స్‌మెన్లలో అంకిత్‌రాజ్ 81, పరంజీత్ సింగ్ 78 పరుగులతో రాణించారు. ఆంధ్ర జట్టు బౌలర్లలో మహీప్, ఆంజినేయులు, ఇస్మాయిల్, కేవీఎస్ఎన్ రాజులు చెరో వికెట్‌ను సాధించారు. చివరి రోజు ఆటను టీ బ్రేక్‌లో ఇరు జట్ల క్యాప్టెన్ల సమ్మతంతో డ్రాగా ముగించారు. ముగింపు కార్యక్రమానికి మ్యాచ్ రెఫరీ శక్తి సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు అద్భుతమైన ఆటతీరుతో అలరించారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు, అంపైర్లు భారతివిజ్, రాజేష్ కన్నన్, స్కోరర్లు విజయ్, చైతన్య, వీడియో అనాలిస్ట్ రహిమాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేశవ్... గోబెల్స్ ప్రచారాన్ని కట్టిపెట్టు

- మాజీ ఎమ్మెల్యే విశ్వ ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: వైఎస్ వివేకానందరెడ్డి హత్య వ్యవహారంపై టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. సీఎం జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఉరవకొండ పట్టణంలోని 10 వార్డులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గోబెల్స్ ప్రచారంలో దిట్ట అని అందుకే బోడిగుండుకు మోకాలికి ముడిపెడుతున్నాడన్నారు. విశాఖ రాజధాని అని సీఎం వైఎస్ జగన్ ప్రకటన చేస్తే వైఎస్ వివేకా హత్య కేసును కేశవ్ తెరమీదకు తీసుకురావడమే ఇందుకు నిదర్శమన్నారు. వివేకా హత్య కేసుతో సీఎం జగన్‌కు ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. అసలు జగన్‌పై ఆరోపణలు చేసే నైతిక అర్హతే కేశవ్‌కు లేదన్నారు. కేశవా ఒక్కసారి మీ కుటుంబ చరిత్రను తిరిగి చూసుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఈ మూడున్నరేళ్లలో నియోజకవర్గ ప్రజలను గాలికొదిలి హైదరాబాద్, విజయవాడలకు పరిమితం అయిన నువ్వా నీతులు మాట్లాడేది అని మండిపడ్డారు. లోకేష్ పాదయాత్ర ఓ వైఫల్యయాత్ర అని, మరో 5 వేల కిలో మీటర్లు నడిచినా ప్రజలు టీడీపీని నమ్మరని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమీర్‌శర్మ రాక

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, మాజీ సీఎస్ సమీర్ శర్మ గురువారం జిల్లాకు విచ్చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు అనంతపురం చేరుకుంటారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ)పై సంబంధిత అధికారులతో ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్షిస్తారు. అదే విధంగా సచివాలయ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులతో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి పుట్టపర్తికి వెళతారు.

వంద రోజుల పనిదినాలు కల్పించాలి

యాడికి: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించాలని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిక్కేపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఎంత మంది కూలీలు వచ్చారు, మస్టర్లు సరిగ్గా వేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఎంపీడీఓ సమావేశ భవనంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్ లతో సమావేశమై పలు సూచనలు చేశారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పుట్లూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన అంకమ్మ (78) అనే వృద్ధురాలు బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల వివరాలమేరకు... అంకమ్మకు గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనేపథ్యంలోనే మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

టెక్నికల్ విభాగాల తనిఖీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న టెక్నికల్ విభాగాలను ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి తనిఖీ చేశారు. 100 డయల్, ఈ–సర్వేలెన్స్, స్పెషల్ బ్రాంచ్, కమ్యూనికేషన్ కార్యాలయాలను బుధవారం ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఆయా విభాగాల్లో వినియోగించే పరికరాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కమ్యూనికేషన్ విభాగాలు పటిష్టంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలందించగలమని వెల్లడించారు. మరింత వేగవంతంగా సేవలందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ చక్రవర్తి, ఎస్ఐ సుధాకర యాదవ్ ఉన్నారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు

గార్లదిన్నె: మండల కేంద్రానికి చెందిన గణేష్ ,శివ అనే వ్యక్తులపై బుధవారం ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ పుట్లూరు మండలం ఏ.కొండాపురానికి చెందిన రాజేంద్ర ప్రసాద్ అనే వ్యక్తి శింగనమల మండలం నాగుల గుడ్డంకు చెందిన కూలీలతో గార్లదిన్నెలో స్థలం క్లీన్ చేస్తుండగా అదే సమయంలో గణేష్ ,శివ అనే స్థలం తమది అంటూ కూలీలు ఘర్షణ పడ్డారన్నారు. రాజేంద్ర ప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు వెంటనే అతన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గణేష్, శివలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కొడుకులనే గెలిపించుకోలేని దద్దమ్మలు జేసీ బ్రదర్స్

- ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వెంకట్రామిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ధర్మవరం ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: తన కొడుకులను ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిపించుకోలేని దద్దమ్మలు జేసీ సోదరులని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి నిర్వహిస్తున్న ప్రజా సంక్షేమ యాత్రకు ధర్మవరం ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. మేడిమాకులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. గతంలో ఎవరైనా జేసీ బ్రదర్స్‌కు ఎదురు తిరిగితే వారిని హత్య చేయించడానికి కొందరు అమాయకులను ప్రేరేపించి గ్రామాల్లో కక్షలు పెంచేవారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అలాంటి పరిస్థితి గ్రామాల్లో ఎక్కడా లేదన్నారు. కొన్ని టీవీ ఛానళ్లలో జేసీ సోదరులను టీడీపీ సీనియర్ నాయకులుగా సంబోధిస్తున్నారని, వారు టీడీపీ సీనియర్ నాయకులు ఎలా అవుతారో చెప్పాలన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జేసీ సోదరులు వారి ఆధిపత్యం కోసం ఎంతోమంది టీడీపీ కార్యకర్తలను చంపించలేదా అని ప్రశ్నించారు. ఎంతమంది మహిళల తాళిబొట్లు తెంచారో చెప్పాలన్నారు.

జేసీ సోదరులను తరిమికొట్టండి..

ప్రస్తుతం మాజీ సీఎం చంద్రబాబు తన కొడుకు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి అష్టకష్టాలు పడుతున్నాడని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని ఢీకొనే శక్తి నారా లోకేష్‌కు లేదని స్పష్టం చేశారు. మర్యాద ఇవ్వడం తెలియని మూర్ఖులు జేసీ బ్రదర్స్‌ను నియోజక వర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాజకీయ లబ్ధికోసం ఎంతకైనా దిగజారుతారని చెప్పారు. కుల, మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.

లోకేష్ ఏమీ చెప్పుకోలేకపోతున్నారు

తాడిపత్రి: యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ టీడీపీ హయాంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి మేలు చేయకపోవడంతోనే ఏమీ చెప్పుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాలు బాగుండాలి, వారి పిల్లలు విద్యావంతులుగా తయారవ్వాలి, ఫ్యాక్షన్ జోలికి వెళ్లవద్దు అన్న సందేశంతో పాటు ప్రజలకు ఇంకా ఏం మేలు చేయగలమన్న ఆలోచనతోనే చిన్నాన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజాసంక్షేమ యాత్ర చేస్తున్నారన్నారు. జేసీ సోదరుల్లాంటి వెధవలను ఆదరిస్తే మీ జీవితాల్లో సర్వం కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత... జేసీ ప్రభాకర్‌రెడ్డి పిచ్చికుక్కలా మారిపోయాడన్నారు. ఎన్నడూ ప్రజల ఇండ్ల ముఖం చూడని జేసీపీఆర్ ఇప్పుడు ఇళ్ల వరకు వస్తున్నాడంటే వారిలో రాజకీయ అస్థిరత ఏర్పడటమే కారణం అన్నారు.

అహ్మదాబాద్-తిరుచునాపల్లి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అహ్మదాబాద్-తిరుచునాపల్లి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల రెండో తేదీ (గురువారం) అహ్మదాబాద్ జంక్షన్ నుంచి (09419) ఈ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరుతుంది. తిరుచునాపల్లి జంక్షన్ నుంచి ఈ నెల 5(ఆదివారం)న అహ్మదాబాద్‌కు బయలుదేరుతుంది. ఈ రైళ్లు మార్చి 30 వరకు ప్రతి గురు, ఆదివారాల్లో రాకపోకలు సాగిస్తాయి. ఈ రైళ్లు రాయలసీమలోని మంత్రాలయం, గుంతకల్లు, తాడిపత్రి, వైఎస్సార్ కడప, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

న్యాయవాదిపై దాడి కేసులో మహిళ అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని న్యాయవాది తులవ శివప్రసాద్‌పై కొడవలితో దాడికి యత్నించిన కేసులో రోజా అనే మహిళతో పాటు ఆమె తండ్రి ఆనంద్, అన్న కిషోర్‌లను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ శివరాముడు తెలిపిన వివరాలమేరకు.. 2021లో ఉరవకొండ ప్రాంతంలో ఓ స్థల వివాదంలో భాగంగా రోజా న్యాయవాది తులవ శివప్రసాద్‌ను ఆశ్రయించింది. కాగా ఫీజు విషయంలో న్యాయవాదితో తగాదా పడి అతనిపై రోజాతో పాటు తండ్రి, అన్నలతో కలసి కొడవలితో దాడికి యత్నించింది. ఈ విషయంపై బాధిత న్యాయవాది ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

క్లుప్తంగా

ఆత్మకూరులో 75 శాతం పింఛన్ పంపిణీ

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచే గ్రామ వలంటర్లు పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు అందజేశారు. ఫలితంగా తొలిరోజు బుధవారమే మండలంలో 75 శాతం పింఛన్ పంపిణీ పూర్తయ్యింది.

సీపీఐ మండల కమిటీ ఎంపిక

కనగానపల్లి: సీపీఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కార్యదర్శిగా బాలరాజు, సహాయ కార్యదర్శులుగా మల్లికార్జున, నాగరాజు, కమిటీ సభ్యులుగా వీరయ్య, పి. రాములను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యుడు మహదేవ, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పునే వాడాలి

రాప్తాడు: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ అయోడిన్ ఉప్పునే వాడాలని హెల్త్ సూపర్ వైజర్ అరుణమ్మ సూచించారు. బుధవారం మండలంలోని ప్రసన్నాయపల్లిలో ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పుట్టుకతోనే ఉన్న మచ్చలు, వచ్చిపోయే మచ్చలు, పూర్తిగా తెల్లని మచ్చలు, దురద పెట్టే మచ్చల గురించి పూర్తిస్థాయిలో తెలుసుకోవాలన్నారు. ఏ మాత్రం అనుమానం ఉన్నా దగ్గర్లోని వైద్యున్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్పన, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్ఎం బాలగొండ సునీత, సర్వేయర్ కిశోర్, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

భైరవస్వామి పల్లకీ ఊరేగింపు

చెన్నేకొత్తపల్లి: గాండ్లకులస్తుల ఆరాధ్య దైవం భైరవస్వామి పల్లకీ ఊరేగింపును బుధవారం న్యామద్దల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘమాసంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలోనే ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు అనంతరం స్వామివారిని పల్లకీలో కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో భీష్మ ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సత్సంగ మండలి వారి నేతృత్వంలో వందలాది మంది భక్తులు విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. నిర్వాహకులు పాలసముద్రం నాగరాజు, విజయ్‌కుమార్, అధ్యక్షులు మేడా వేంకటేశ్వర్లు భీష్మ ఏకాదశి విశిష్టతను వివరించారు. కోటి విష్ణు నామ పారాయణం చేయాలని నిశ్చయించుకున్నామని, ఇది 90 రోజుల పాటూ సాగుతుందని భక్తులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడికి అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు.

డ్రాపౌట్లను బడిలో చేర్చాలి

అనంతపురం క్రైం: బడి మానేసిన పిల్లల(డ్రాపౌట్స్)ను తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం నగరంలోని 70వ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ వివరాలు పక్కాగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు వెళ్లని 300 మంది పిల్లలు తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మాతా శిశు మరణాల రేటు తగ్గించడంతో పాటు గర్భిణీలు, బాలింతలకు అందించే సేవల్లో జాప్యం ఉండకూడదన్నారు. హైరిస్క్ కేసుల పట్ల ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, కమిషనర్ కె.భాగ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్, అదనపు డీఎంహెచ్‌ఓ యుగంధర్ పాల్గొన్నారు.

శనీశ్వరస్వామి విగ్రహ వితరణ

అనంతపురం కల్చరల్: నగరంలోని హరిహర దేవాలయానికి ఫణిభూషణ్, విజయకళ అనే భక్తులు పంచలోహ శనీశ్వర విగ్రహాన్ని, వెండి కిరీటాన్ని బుధవారం వితరణ చేశారు. ఉదయం విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేసి, సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం ఆలయంలో ప్రత్యేకంగా తైలాభిషేకాలు గావించారు. ఈ విగ్రహాన్ని శనిత్రయోదశి వేళల్లో, శనీశ్వర జయంతి రోజున దోష నివారణార్థం వినియోగిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

కొడుకులా ఆదరిస్తున్నాడు

- సీఎం జగన్ మేలు మరువలేము
- సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరు భేష్
- లబ్ధిదారుల మోములో వెల్లివిరిసిన సంతోషం



సంఘమిత్ర కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ ఇస్తున్నారు. ఇంటి వద్దకే రేషన్ వస్తోంది. కొడుకులు, కూతుర్లు పట్టించుకోని ఈ రోజుల్లో కన్నకొడుకులా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతతో ఆదరిస్తున్నాడు' అని మదీన అనే వృద్ధురాలు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో సంతోషం పంచుకుంది. బుధవారం నగరంలోని 34వ డివిజన్‌లోని సంఘమిత్ర కాలనీలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ మునగల రమాదేవితో కలసి మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. ఇరుకు వీధుల్లో ఎమ్మెల్యే పర్యటించి, వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. వృద్ధురాలు మదీన మాట్లాడుతూ తన బిడ్డ హైదరవలి పక్షవాతంతో బాధపడుతున్నాడని, అతనికి ప్రభుత్వం ఇచ్చే పింఛన్ సొమ్ముతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తెలిపింది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని తస్లీమ్ అనే మహిళ చెప్పింది. అమ్మ ఒడితో ఎటువంటి ఆర్థిక సమస్య లేకుండా కుమారుడి భవిష్యత్తుకు ఉపయోగపడుతోందని శ్రీదేవి అనే మహిళ ఆనందం వ్యక్తం చేసింది. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ స్కూళ్లను ఏర్పాటు చేశారని, బాబును అక్కడే చదివిస్తున్నామని, సీఎం జగన్ సార్ చేస్తున్న మేలును మరువలేమని చెప్పింది. అమ్మఒడి, చేయూత ద్వారా వచ్చే డబ్బులతో బాబు చదువుకు, తన వైద్య ఖర్చులకు వినియోగించుకుంటున్నామని అస్మ అనే మహిళ ఎమ్మెల్యేకి తెలియజేసింది. ఆలమూరులో స్థలం మంజూరైందని, అందుకు సంబంధించి పట్టా ఇవ్వలేదని లక్ష్మిదేవి అనే మహిళ ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేయగా, చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలియజేశారు.

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

సంఘమిత్ర కాలనీలో డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం చూపాలని రహమత్‌బీ, మణెమ్మ, తదితరులు కోరగా.. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో సమస్యకు పరిష్కారం చూపాలని ఎమినిటీ చర్విత్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. దెబ్బతిన్న పోల్లను మార్చేలా చూస్తామని, కొన్ని ప్రాంతాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇప్పటికే సచివాలయ పరిధిలో రూ.14.5 లక్షలు, రూ.11.5 లక్షలతో రోడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, నరసింహులు, టీవీ చంద్రమోహన్‌రెడ్డి, సాకే చంద్రశేఖర్, డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, గోయిందు, శోభారాణి, వైఎస్సార్‌సీపీ నేతలు, నాయకులు అనంత చంద్రారెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, నిహార్‌రెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి, గుజ్జల శివయ్య, జావెద్, శ్రీదేవి, గౌరి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అనంతపురం రూరల్: రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగే పరశురామ్ తదితరులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు నిర్మాణాలు చేపట్టి సొంతింటి కల సాకారం చేశామన్నారు.

అభివృద్ధిని గమనించండి

చంద్రబాబునగర్‌లో గతంలో జరిగిన అభివృద్ధి.. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే అన్నారు. కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రుద్రంపేట పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీపీ వరలక్ష్మి, ఉపసర్పంచ్ నరేంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మహబూబ్‌బీ, లక్ష్మీనారాయణమ్మ, ఓం ప్రకాశ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, సాదిక్‌వలి, కృష్ణవేణి, కుళ్లాయప్ప, గోవింద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతినాయుడు, మల్లెల వేణుగోపాల్, రహీం, అంజీ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఒడిబియ్యం

అనంతపురం కల్చరల్: నిత్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబునగర్ కాలనీలో నివసిస్తున్న మహిళలకు ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ నిర్మలా మురళి సంప్రదాయసిద్ధంగా ఒడిబియ్యం పెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టినింటి నుంచి ఒడిబియ్యానికి నోచుకోని వారిని ఎంపిక చేసుకుని తాము ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా వారికి లక్ష్మీ, శ్రీహరి దంపతుల సౌజన్యంతో నెలకు సరిపడే నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సుభద్రమ్మ, శకుంతల, జానకి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

అనంతపురం క్రైం: నగరంలోని 28వ డివిజన్‌లో నేతాజీ పార్క్‌ను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పార్క్‌లో ట్రాక్, తదితర అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అబూసాలెహ, డివిజన్ కన్వీనర్ రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం

అనంతపురం క్రైం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా 37 మంది ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేశారు. జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్ ఆర్ ఆదోని రక్తదానం చేసిన ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఆర్టీసీ ఉద్యోగులు విధిగా రక్తదానం చేస్తున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సేవలు స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంఠస్త పోటీల్లో బాలల ప్రతిభ



బహుమతులందుకుంటున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: రామచంద్రానగర్‌లోని టీటీడీ కల్యాణమండపంలో అచ్యుతాష్టకం, శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రంపై నిర్వహించిన కంఠస్త పోటీల్లో బాలబాలికలు ప్రతిభ కనబరిచారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు (టీటీడీ), హిందూ ధర్మ ప్రచార పరిషత్తు సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. చిన్మయామిషన్ జిల్లా ఇన్‌చార్జి స్వామి ఆత్మవిదానంద సరస్వతి, పురాణ పండిట్ వేణు, బద్రీనాథ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. 'అచ్యుతాష్టకం'లో సాత్విక, జయని, తాన్వి వరుసగా తొలి మూడు బహుమతులను సాధించగా, విష్ణు సహస్రనామ పోటీల్లో రిషిత, జ్యోత్స్నరెడ్డి, మనస్విని తొలి మూడు స్థానాలను దక్కించుకుని టీటీడీ ధార్మిక సంస్థ ప్రతినిధులు శ్రీపాద వేణు, బాబు, వరప్రసాద్, సుధామణి చేతుల మీదుగా బహుమతులందుకున్నారు. అంతకుముందు పండిట్ వేణు గోవింద నామస్మరణ చేయించారు. జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనవసరంగా మందులు పిచికారీ చేయొద్దు



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ తదితరులు

రాప్తాడురూరల్: పంటలకు అనవసరంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేయొద్దని అనంతపురం ఏడీఏ వెంకటరాముడు రైతులకు సూచించారు. బుధవారం అనంతపురం మండలం నరసనాయని కుంట గ్రామంలో పొలంబడి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ మాట్లాడుతూ పొలంబడి పద్ధతిని పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. రసం పీల్చే పురుగులకు ఎల్లో ట్రాప్స్, బ్లూ ట్రాప్స్ పెట్టి నివారించుకోవచ్చని సూచించారు. జీవన రేఖ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంట రుణాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం ఇస్తారన్నారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు చేయించుకోవాలన్నారు. కేవీకే- రెడ్డిపల్లి శాస్త్రవేత్త రవికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ పేనుబంకను నివారించడానికి ఇమిడాక్లోప్రిడ్ లేదా అసిటాంప్రిడ్ మందును పిచికారి చేయాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు కాంటఫ్‌తో పాటు హెక్సాకోనజోల్ మందును పిచికారి చేయాన్నారు. రబీ సీజన్‌లో పంట వేసిన రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రసాద్, మురళి, వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏ, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పశువైద్యం మరింత వేగవంతం



వెటర్నరీ అంబులేటరీ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: పశువైద్యం మరింత వేగవంతం అయ్యిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. రెండో విడత కింద అనంతపురం నియోజకవర్గానికి కేటాయించిన మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బుధవారం ప్రారంభించారు. పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పశు, జీవ సంపద పరిరక్షణ, పాడి అభివృద్ధి లక్ష్యంగా జగన్ సర్కారు మొదటి విడతగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున వాహనం కేటాయించగా, వాటి ద్వారా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. దీంతో రెండో విడత కింద మరో వాహనం కేటాయించారన్నారు. 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయగానే 108 మాదిరిగా అంబులెన్స్ చేరుకుని సకాలంలో పశువైద్యం అందిస్తారని తెలిపారు. పశుశాఖ అధికారులు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ ఎస్.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వినియోగించుకోవాలి

కనగానపల్లి: ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ సూచించారు. బుధవారం మండలంలోని కేఎన్ పాళ్యం గ్రామంలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలందించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి విద్యార్థులకు వైద్య సేవలందించారు. దీంతోపాటు కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మౌనిక, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే వందశాతం ఉత్తీర్ణత

ఆత్మకూరు: పట్టుదలతో చదివితే పదో తరగతి విద్యార్థులంతా మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని ఎంఈఓ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని తలుపూరు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సెల్‌ఫోన్ వాడకం పూర్తిగా తగ్గించి... ప్రతి ఒక్కరూ ఏకాగ్రతతో చదవాలన్నారు. ప్రతి సబ్జెక్టుకు కొంత సమయం కేటాయించి ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన విషయంతో ఎలాంటి లోపాలు ఉండకూడదని, తాజా కూరగాయలు వాడుతూ నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అండర్-7 మిక్స్‌డ్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత ఆత్మకూరు



అండర్-7 విజేతగా నిలిచిన ఆత్మకూరు జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-7 మిక్స్‌డ్ జెండర్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా ఆత్మకూరు ఫుట్‌బాల్ క్లబ్ జట్టు నిలిచింది. అండర్-9 విజేతగా లేపాక్షి ఫుట్‌బాల్ జట్టు నిలిచింది. అనంత క్రీడా మైదానం వేదికగా బుధవారం ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహించారు. లాలిగా ఫౌండేషన్ డైరెక్టర్ ఓల్గా, డైరెక్టర్ పెడ్రో మలబియా, మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారిణి అన్వైర్ లాంబ, ప్రాజెక్టు టెక్నీషియన్ పబ్లో మల్వే, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోఆర్డినేటర్ దాదాఖలందర్, వంశీకృష్ణ, వంశీబాల, కిశోర్, ఆనంద్, అంజలి, భాస్కర్, రియాజ్, కోచ్‌లు లోకనాథ్, రామాంజి, మురళి, ప్రకాష్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి చాంపియన్‌గా అనంత

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ అండర్-14, అండర్-17 బాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విన్నర్‌గా అనంత బాలికల జట్లు నిలిచాయి. జిల్లా నుంచి అమృత, హరిత అండర్-17 బాలికల విభాగంలో, సుప్రియ అండర్-14 బాలికల విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా జట్టును, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ముగ్గురు బాలికలను ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య, డీవీఈఓ పద్మప్రియ, ఏసీ గోవిందునాయక్, సూపరింటెండెంట్ ఆదినారాయణ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్, కోఆర్డినేటర్ నాగరాజు, అమర్, గీత, ప్రభాకర్, పీడీ నాగరాజు, మొరార్జీ యాదవ్, వేణు, శ్రీధర్, రమేష్, శివ, ప్రసాద్ తదితరులు అభినందించారు.

వైభవంగా శంకరమఠం వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని శృంగేరి శారదా శంకర మఠం వార్షికోత్సవ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. భక్తిశ్రద్ధలతో హోమాలు, చంద్రమౌళీశ్వరునికి పాశుపత అభిషేకాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్ష్మీ, సరస్వతీ, వాస్తు హోమాలను పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. గురువారంతో వార్షికోత్సవ వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు ప్రసాద్ తెలిపారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు విశ్వక్‌తేజ్ ఎంపిక



మోక్షిత్ విశ్వక్‌తేజ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు అనంతపురం రఘు సైనిక్ స్కూల్ విద్యార్థి మోక్షిత్ విశ్వక్‌తేజ్ ఎంపికయ్యాడు. ఇతడు గత నెల 29 నుంచి 31 వరకు అనకాపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో క్యాడెట్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లో జాతీయస్థాయి పోటీలకు జరగనున్నాయి. ఎంపికైన విద్యార్థిని పాఠశాల డీన్ రాఘవేంద్ర ప్రత్యేకంగా అభినందించారు.

డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



వేణుగోపాల్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరంలోని అన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ వసీం ప్రజలకు హామీ ఇచ్చారు. బుధవారం 3వ డివిజన్‌లోని వేణుగోపాల్‌నగర్‌లో మేయర్ పర్యటించారు. వర్షాలు వచ్చినప్పుడు మురుగు ఎక్కడా నిల్వకుండా, ఇళ్లలోకి చేరకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రతి సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షల నిధులతో చిన్న పాటి సమస్యలున్న కాలువలు, రోడ్లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరానికి మంజూరైన రూ.25 కోట్ల ప్రత్యేక నిధులతో రోడ్లు, కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, డివిజన్ కన్వీనర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా తిరుమలకు...

రామగిరి: మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన 20 మంది భక్తులు బుధవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఉదయాన్నే ఆంజనేయస్వామి, ఈశ్వరదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేరూరు నుంచి పాదయాత్రగా బయలుదేరి రాగిమేకలపల్లి, గోరంట్ల, వాయల్పాడు, పీలేరు మీదుగా మొత్తం 320 కి.మీ పాదయాత్ర చేసి తిరుమలకు వెళ్తామన్నారు. 8 రోజులపాటు సాగే ఈ పాదయాత్రలో మోహన్‌స్వామి, నాగరాజు, గౌనిగోపాల్, వెంకటరెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్

అనంతపురం అర్బన్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేకమైనదిగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. రాంభూపాల్ మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను, సహజ వనరులను, ప్రభుత్వరంగ సంస్థలను దోచిపెట్టేందుకు మోదీ ప్రభుత్వం నిస్సిగ్గుగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసిందని విమర్శించారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయాన్ని పాతిపెట్టి కార్పొరేట్ వ్యవసాయాన్ని పెంచేందుకు ఎరువుల సబ్సిడీపై 25 శాతం కోత విధించిందన్నారు. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి విషయంలో ఎలాంటి ప్రకటనా చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర, శ్రీనివాసులు, రామిరెడ్డి, కృష్ణమూర్తి, ముష్కిన్, రామాంజి, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు పదోన్నతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: డీసీఆర్బీలో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహనరెడ్డి ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం జిల్లా ఎస్పీ ఫక్కీరప్పను కలసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా గ్రామోత్సవం



ఆత్మకూరులో మడివాల మాచిదేవుడు గ్రామోత్సవం నిర్వహిస్తున్న రజకులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో వెలసిన రజకుల ఆరాధ్యదైవం మడివాల మాచిదేవుడు జయంతిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన రజకులు మాచిదేవుడు చిత్రపటాన్ని వెండి రథంలో కొలువుదీర్చి గ్రామోత్సవ నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వన్నూరప్ప, సూరప్ప, పెద్ద వన్నూరప్ప, చెన్నప్ప, రామయ్య, చౌడప్ప, చలపతి, చెన్నకేశవ, మురళి, నరేంద్ర, రవి, సదా తదితరులు పాల్గొన్నారు.